క్లుప్తంగా

6 నుంచి వాలీబాల్ పోటీలు

రాజవొమ్మంగి: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ నుంచి మండలంలోని లబ్బర్తి పంచాయతీ, నెల్లిమెట్ల గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ తాము సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 11వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490290520లో సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని జాతీయ పండుగలు వాటి ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన ఈ పోటీలను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్ అధ్యక్షత వహించారు. కన్వీనర్ సుందరి రాణి పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు. విజేతలకు సంక్రాంతి పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. విజయలక్ష్మీ, అనిత కుమారి, అంబిక, భవానీ, నాగబాబు, కొండబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో 22 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయినకుమారి

గూడెంకొత్తవీధి: మొండిగెడ్డ పంచాయతీ మారుమూల ఉన్న మొండికోట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శనివారం మొదలయ్యాయి. ఈ పనులనుఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ ప్రియాంకలు ప్రారంభించారు. మొత్తం 370 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించనున్నట్టు వారు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోహర్, వార్డు సభ్యులు బుజ్జిబాబు, వంతల రాజారావు, లక్ష్మణరావు, నాయకులు కామరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ డే వేడుకలు


వేడుకలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 101 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రీ స్కూల్‌డే వేడుకలు నిర్వహించినట్టు సీడీపీవో దేవమణి తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల తల్లిదండ్రులకు ప్రీస్కూల్ వేడుకల ఆవశ్యకతను వివరించారు. ప్రీస్కూల్ నిర్వహణ, తీసుకుంటున్న జాగ్రత్తలను తదితర విషయాలను తెలియజేశారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి


జి.మాడుగులలో పాదయాత్ర చేస్తున్న ఎస్ఎస్ఎఫ్ నాయకులు, భక్తులు

జి.మాడుగుల: విజయవాడలో ఆదివారం నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్ఎస్ఎఫ్ జిల్లా సభ్యుడు మత్స్యరాస మత్స్యరాజు, విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచారకుడు రీమెలి అప్పలరాజు పిలుపునిచ్చారు. మండలంలో గాంధీనగరం–జి.మాడుగుల పురవీధుల్లో హైందవ శంఖారావం సభకు తరలిరావాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఎస్ఎస్ఎఫ్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.


ఎండబెట్టిన రాగులు


దుంబ్రిగుడలో రాగుల పంట

- విస్తారంగా సాగు
- మార్కెట్‌లో గిరాకీ
- గిట్టుబాటు ధరలు
- ఆనందంలో రైతులు

ఆరోగ్య సిరులు..
చిరుధాన్యాలు


రాగుల పంటను శుభ్రం చేస్తున్న రైతులు


సామలను గాలిపోత చేస్తున్న రైతులు

దుంబ్రిగుడ: చిరుధాన్యాల సాగుతో జీవితాలు బాగుపడుతున్నాయని గిరిజన రైతులు చెబుతున్నారు. చిరుధాన్యాలు సాగుతో ఆర్థికంగా లాభాలతో పాలు ఆరోగ్య పరంగా ఎంతో లాభదాయకమని, శారీరక దృఢత్వంతో పాటు రోగనిరోధక శక్తికి ఎంతో దోహదపడుతుందని వైద్యులు, మేధావులు అంటున్నారు. ఇందులో ముఖ్యపాత్ర పోషించేది రాగులు. పూర్వం రాగి ముద్ద, రాగి జావా, రాగి సంకటి ఆహారంలో ప్రధానంగా ఉండేది. కాలం మారే కొద్దీ రాగుల వినియోగం తగ్గింది...ఫలితంగా సాగు తగ్గుముఖం పట్టింది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా రోగాలు దరి చేరాయి. ముఖ్యంగా మధుమేహం, బీపీ, గుండె జబ్బులు పెరిగాయి. తృణధాన్యాలతో ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని వైద్యులు, నిపుణులు సలహాలిస్తున్నారు. దీంతో రాగులు, కొర్రలు, సామలు, జొన్న వంటి చిరుధాన్యాలకు గిరాకీ పెరిగింది. ఫలితంగా మన్యంలో వీటి సాగు మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు.

సాగుపై ఆసక్తి

మండలంలోని సొవ్వా, అరమ, పోతంగి, కంద్రుమ్, కితలంగి, లైగండ, అరకు పంచాయతీల్లో రాగులు– 2,318 హెక్టార్లలో, సామలు– 856.8 హెక్టార్లలో, జొన్నలు– 1.2 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాగులు, కొర్రలు పంట కోతలు పనులు జరుగుతున్నాయి. పంటను సేకరించి కల్లాల్లో మటించే పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమై ఉన్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు పంటలు పాడవకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు ఎంతో ఉపాయోగపడ్డాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి బాగుంది



మేము జూలై, ఆగస్టులో ఈ చిరుధాన్యాల పంటలను వేశాం. పంట చేతికి వస్తుందనే సమయంలో తుపాను వల్ల కోతలు చేసి వదిలేశాం. ప్రస్తుతం ఎండ కాస్తుండటంతో ఎండబెట్టి వాటిని కల్లాలో మట్టిస్తున్నా. దిగుబడి బాగుంది. త్వరలో మార్కెట్‌కు తరలిస్తాం.

– వంతల కేతు, సింధిపుట్టు గ్రామం, పోతంగి పంచాయితీ, దుంబ్రిగుడ.

గ్రామాలకు నేరుగా వస్తున్న వ్యాపారులు



పంట కొంత అమ్ముతాం. కొంత మేము ఉంచుకుంటాం. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడి బాగుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులకు, సాం లకు, జొన్నలకు మంచి డిమాండ్ ఉంది. ఈ దినుసులను కొనేందుకు నేరుగా వ్యాపారులు మా ఊరువద్దకే వస్తున్నరు.

– గున్నో, వ్యవసాయ కూలీ

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి



గిరిజన రైతులు పండిచి సేకరించిన చిరుధాన్యాలు రాగులు, సాంలు, జొన్నలు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి. ప్రస్తుతం మండలంలోని నాలుగు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. పోతంగి, కొర్రాయి, సాగర, అరమలో ఉన్నాఇ. రైతులు నేరుగా అక్కడ తీసుకొచ్చి విక్రయించాలి.

– నీలవేణి, వ్యవసాయ అధికారి, దుంబ్రిగుడ మండలం

రెవెన్యూ సదస్సుల్లో వెల్లువెత్తిన వినతులు


అడ్డతీగలలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సూర్యారావు తదితరులు


తురాయిగుడ రెవెన్యూ సదస్సులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. భూసమస్యలపై స్థానికులు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

మండలంలోని చినలబుడు పంచాయతీ తురాయిగుడ గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, పీసా కమిటి కార్యదర్శి ఎం. రంజిత్ కుమార్, సర్పంచ్ ఉపేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లోక్కోయి లక్ష్మీకుమార్ వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతంలో పట్టా మ్యూటేషన్‌కు డెత్, ఫ్యామిటీ మెంబర్ సర్టిఫికెట్లను మినహాయించాలని కోరారు. మ్యూటేషన్‌కు ఆయా ధ్రువపత్రాలు ప్రమాణికం చేయడంతో కొన్ని తరాలుగా పట్టా మ్యూటేషన్‌కు గిరిరైతులు నోచుకోవడం లేదన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి, పంచనామ రాయించుకొని మ్యూటేషన్ చేయాలని కోరారు.

అడ్డతీగల: స్థానిక గ్రామ సచివాలయం–1లో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కె.సూర్యారావు, డీటీ తేజస్విని, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించారు.

గంగవరం : ఎండపల్లి, ఇ.రామవరం గ్రామాల్లో సర్పంచ్ బండారు రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , మాజీ ఎంపీపీ తీగల ప్రభ పాలొని ప్రసంగించారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు


బుడ్డింగిలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ బుడ్డింగి మారుమూల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రాంబాబు ఆదేశాల మేరకు శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉండడంతో కాచి చల్లార్చిన నీరు తాగాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సిబ్బంది తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఏఎన్ఎంలు కాంత, పూర్ణి, ఎంఎల్‌హెచ్‌పీలు రోషిని, లక్ష్మణ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

6న కాల్‌లెటర్లు అందజేత

కొయ్యూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ ఉన్న హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న వారు సీడీపీవో కార్యాలయానికి వచ్చిన కాల్ లెటర్లు పొందవచ్చని సీడీపీవో విజయకుమారి చెప్పారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 6 నుంచి కాల్‌లెటర్లు ఇస్తున్నామని, వారి ఒరిజనల్ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. అనంతరం ఈనెల 9న పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఇందులో భాగంగా మండలంలోని బి.కొత్తూరు కేంద్రానికి నాలుగు, రాజులపాడు, దవడగొయ్యి, జోగంపేటకు ఒక్కో దరఖాస్తు అందించినట్టు ఆమె తెలిపారు.

సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెంపు



శిక్షణలో మాట్లాడుతున్న అనకాపల్లి భూసార విభాగం అధిపతి డాక్టర్ శ్రీలత

చింతపల్లి: జీవన ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయం వల్ల భూసారం మెరుగుపడుతుందని అనకాపల్లి భూసార విభాగ సాయిల్ సైన్స్ అధిపతి డాక్టర్ టి. శ్రీలత అన్నారు. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయంలో గిరిజన యువతకు జరుగుతున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి ఆమె శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా భూసారం మెరుగుపడితేనే పంటల దిగుబడులు బాగుంటాయన్నారు. భూసారం పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులు పాటించాల్సిన పద్ధతులను చింతపల్లి భూసార శాస్త్రవేత్త జోగారావు వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బాలహంస్సేన్‌రెడ్డి, డాక్టర్ బయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు


పిడితమామిడిలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రామిరెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం : రెండు సార్లు కోరం లేక వాయిదా పడ్డా గంగవరం మండలం పిడతమామిడి పీసా కమిటీ ఎన్నిక శనివారం ప్రశాంతంగా జరిగింది. సర్పంచ్ నేషం మరిడమ్మ అధ్యక్షతన తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా, మాజీ సర్పంచ్ చలుమర్తి రామిరెడ్డి, కార్యదర్శిగా రెడ్డి సూర్యనారాయణరెడ్డిలను చేతులెత్తే పద్ధతిలో ప్రజలు ఎన్నుకున్నారు. ఎనికైన ఉపాధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికల అధికారి, తహసీల్దార్ శ్రీనివాసరావు నియామకపత్రాన్ని అందచేశారు. ఎంపీడీవో పీజీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటసురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ బి.వెంకటేష్ బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల అభినందనలు

పిడతమామిడి పీసా ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన రామిరెడ్డి, సూర్యనారాయణలను వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. ఇందులో భాగంగా డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి వై.ఎస్.ప్రసాద్, సర్పంచ్ మరిడమ్మ, ఉప సర్పంచ్ మిర్తివాడ రమణారెడ్డి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్లు వర్రే నారాయణరావు, నాగేశ్వరరావు, నాయకులు ఆకుల అప్పారావు, రామకృష్ణ, చిట్టిబాబు, సంజీవరెడ్డి, కుమారి, తదితరులు అభినందనలు తెలిపారు.

అరకులోయటౌన్: అరకులోయలోని 14 పంచాయతీల్లో ఎన్నిక జరిగినట్టు ఎంపీడీవో లవరాజు చెప్పారు.


దుంబ్రిగుడ: మండలంలోని 18 పంచాయతీల్లోని 14 గ్రామాల్లో పీసా కమిటీలను ఎన్నుకున్నారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వైస్ ఎంపీపీ ఆనందరావు, సర్పంచ్ హరి, ఎంఈవో సుందరరావు, ఏవో నీలవేణి, పంచాయతీ కార్యదర్శి వాణి తదితరులు పర్యవేక్షించారు.

చింతపల్లి: మండలంలోని మొత్తం 29 గ్రామాలకు గాను 21 గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 15 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఆరుచోట్ల ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 8 గ్రామాల్లో సరిపడా ఓటర్లు లేకపోవడంతో వాయిదా వేసినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఎన్నికలు వాయిదా

కొయ్యూరు/హుకుంపేట: కొయ్యూరు మండలంలో రేవళ్ల, బట్టపనుకులలో కోరం లేక పీసా కమిటీ ఎన్నికలు వాయిదా పడినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.హుకుంపేట మండలంలోని 44 సెక్టార్లలో పీసా కమిటీ ఎన్నికలు జరిగినట్టు ఈవోపీఆర్డీ అప్పలరాజు చెప్పారు. పాతకోటలో కోరం లేకపోవడం వలన ఎన్నికలు వాయిదా వేసినట్టు తెలిపారు.

న్యాయ పోరాటాలతోనే కార్మికుల సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న నాయకుడు నాగేశ్వరరావు

రంపచోడవరం: కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు అన్నారు. రంపచోడవరం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన నిర్మాణ రంగ కార్మికుల వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కార్మికులకు బూటకపు హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం తరువాత కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం కనీస వేతనాలు పెంచడంలో మొండిచేయి చూపిస్తోందన్నారు. కోర్టులు కనీస వేతనాలు అమలు చేయాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులందరూ సంఘటితమై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్, రామరాజు, నిర్మల, రాణి, రామలక్ష్మి, చెల్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, చెక్‌డ్యాంల మరమ్మతుకు నిధులు


కోటగున్నాల చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు, ఏఈఈ లోకేష్‌కుమార్

చింతపల్లి: మండలంలోని ఎంపిక చేసిన కొన్ని ప్రధాన చెరువులతో పాటు చెక్‌డ్యాంల మరమ్మతులకు రూ.1.50కోట్ల నిధులు మంజూరైనట్టు సాగునీటి వనరుల విభాగం పాడేరు డీఈఈ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చౌడుపల్లి, కోటగున్నాల, తాజంగి ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. మరమ్మతులు చేయాల్సిన చెరువులు, చెక్‌డ్యాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాజంగి జలాశయం మరమ్మతుకు కలెక్టర్ రూ.35లక్షల నిధులు మంజూరు చేశారన్నారు.

చౌడుపల్లి చెరువు మరమ్మతుకు మరో రూ.20లక్షల నిధులు విడుదలైనట్టు తెలిపారు. చౌడుపల్లి, పెదబరడ, బెన్నవరం, తాజంగి, కుడుముసారి, లోతుగెడ్డ బలపం పంచాయతీల్లో మొత్తం 11 పనులకు ప్రభుత్వం తాజాగా రూ.1.50 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఆయా నిధులతో త్వరలో పనులు చేపడతామన్నారు. ఆయన వెంట చింతపల్లి ఎస్ఎంఐ ఏఈఈ లోకేష్‌కుమార్, చౌడుపల్లి నీటి సంఘం అధ్యక్షుడు రమణ తదితరులున్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి


గంగవరంలో సావిత్రిబాయి పూలే జయంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గంగవరం: సావిత్రిబాయి పూలే మహిళా ఉపాధ్యాయులకు, మహిళలకు ఎంతో ఆదర్శనీయమని యూటీఎఫ్ మహిళ రాష్ట్ర కౌన్సిలర్ ఎల్.రుక్మిణి దేవి అన్నారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం ఆర్.వరలక్ష్మి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు మహిళా ఉపాధ్యాయులు రుక్మిణి దేవి, రాధ కుమారి, రామ విజయలక్ష్మి, హెచ్ఎం వరలక్ష్మి, మండల శాఖ గౌరవ అధ్యక్షుడు ఘుబాబుదొర తదితరులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందసర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు రుక్మిణి దేవి మాట్లాడుతూ మహిళా విద్యా వ్యాప్తికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. యూటీఎఫ్ మండల శాఖ గౌరవ అధ్యక్షులు కె.రఘుబాబు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా సాధికారత సాధనకు, బాలిక విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆశ్రమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని కంభం సునేత్రి సావిత్రిబాయి పూలే వేషధారణ ఆకట్టుకుంది. విజయలక్ష్మి, వరలక్ష్మి, ఉమాదేవి, లలిత, లక్ష్మి, భవాని, కృష్ణ, విజయకుమారి, పద్మావతి పాల్గొన్నారు.

సీపీఐ నేతల విరాళాల సేకరణ


పాడేరులో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

పాడేరు రూరల్: సీపీఐ బలోపేతానికి ప్రజలంతా విరాళాలు ఇచ్చి సహకరించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు, పార్టీ శ్రేణులతో కలిసి శనివారం పట్టణంలోని వ్యాపార సముదాయాల్లో విస్తృతంగా విరాళాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు తమ పార్టీ పేద బడుగు బలహీన వర్గాల పక్షాణ ఉంచి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తోందన్నారు.అన్ని వర్గాల వారు పార్టీకి సహాయం చేయాలని కోరారు. నేతలు చంటిబాబు, అమర్, లక్ష్మణరావు, కొండ, రాధాకృష్ణ, కృష్ణ, రాజశేఖర్, తనీష్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్
- చాకచక్యంగా ఆపిన డ్రైవర్


రాజవొమ్మంగిలో బ్రేకులు ఫెయిలై నిలిచిన ఆర్టీసీ బస్

రాజవొమ్మంగి: నర్సీపట్నం నుంచి రాజవొమ్మంగి మీదుగా ఏలేశ్వరం వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు శనివారం రాత్రి రాజవొమ్మంగిలో బ్రేక్స్ ఫెయిల్ కావడంతో బీభత్సం సృష్టించింది. కాగా ఎవరికి ప్రమాదం జరుగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ ఊపిరి పీల్చుకొన్నారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం నుంచి ఏలేశ్వరం వెళ్తున్న లాస్ట్ బస్ రాజవొమ్మంగి శివారుకు వచ్చే సరికి బ్రేకులు పడడం లేనట్టు డ్రైవర్ గ్రహించాడు. ఆ సమయంలో బస్సు నెమ్మదిగా వెళుతోంది. ఎంత ప్రయత్నించినా బస్సు ఆగకుండా ముందుకు వెళ్తుండడంతో లోపల ఉన్న ముగ్గురు ప్రయాణికులు పరిస్థితిని గమనించి రన్నింగ్‌లోనే కిందికి దిగిపోయారు. అయితే ఈ రహదారి నున్నగా ఉండడంత బస్సు ఆగటం లేకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి, వాహనాన్ని 99 ఉద్యోగుల కాలనీ వైపు మళ్లించారు. అక్కడున్న స్థానికులు విషయం తెలుసుకొని బస్సు చక్రాల కింద పెద్ద పెద్ద రాళ్లు వేస్తుండడంతో వాహన వేగం తగ్గి ఓ చోట నిలిచిపోయింది. దీంతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు మన్యంలో కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని కోరారు.

గంజాయి అనర్థాలపై అవగాహన


దొడ్డికొండలో యువతతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి: గిరిజన యువత గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని, అక్రమ రవాణాను మానుకోవాలని సీఐ వరప్రసాద్ అన్నారు. మండలంలోని దొడ్డికొండ గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. స్థానిక యువతతో మాట్లాడారు. గిరిజన యువత గంజాయి, మద్యం, జూదం, రంగురాళ్ల తవ్వకాలు వంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. గిరిజన రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించి, ఆదాయాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంపీపీ కుమారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ మొండికోట గ్రామంలో ఎంపీపీ బోయిన కుమారి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం, రహదారులు తదితర సమస్యలను స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల భవనం పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు బుజ్జిబాబు, రాజారావు, సన్యాసిరావు, భాస్కర్ తదితరులు కోరారు. దీనిపై ఆమె స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం


అడ్డతీగలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

అరకులోయటౌన్/అడ్డతీగల/జి.మాడుగుల/సీలేరు/గంగవరం/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాళ్లు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అరకులోయలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం ఆర్టీసీ రీజన్ చైర్మన్ సియారి దొన్నుదొర, ప్రిన్సిపాల్ కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగలలో జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ప్రిన్సిపాల్ రాజేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి విశ్వనాథం, ప్రిన్సిపాల్ గౌరీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సీలేరులో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎంపీటీసీ సాంబమూర్తి, ఇన్‌చార్జి హెచ్ఎం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఆర్.కృష్ణ, సర్పంచ్ అక్కమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ తదితరులు పాల్గొన్నారు.రాజవొమ్మంగిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ రమణి పాల్గొన్నారు.